కోర్టులో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, మార్చి18 : ములుగు జిల్లా కోర్టు పరిధిలోని న్యాయ సేవాధి కార సంస్థలో పనిచేసేందుకు క్లర్క్, డాటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి పీ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. http://districts.ecours.gov.in/mulugu వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 26 సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849785546, 829733888 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల సంఘం నిబంధనలు అమలు చేయాలి

● కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు ● ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్, మార్చి18 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అధికారులు అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, సెక్టార్ అధికారులతో ఎన్నికల నిబంధనల అమలుపై మొదటి దశ శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల కోసం 36 సెక్టార్లను ఏర్పాటు చేసి, ప్రతి సెక్టార్‌కు ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన విధి విధానాలను తూ.చా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలోకి వచ్చిందని, కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడం, రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం, కుల, మత, వర్ణ, వర్గం ప్రాంతాలపై విద్వేషాలను రెచ్చగొడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రజలు 1950కు కాల్ చేసి కానీ, సీ-విజిల్ యాప్ ద్వారా కానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో అధికారులు క్షేత్ర స్థాయికి చేరుకొని చర్యలు తీసుకుంటారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి చిత్రా మిశ్రా మాట్లాడుతూ దివ్యాంగ ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. సీ-విజిల్ యాప్ ఫిర్యాదులను అధికారులు పరిశీలించి అప్‌డేట్ చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, డీపీఆర్వో రఫిక్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నాక్లయింట్లు రాజేశ్, కొండపాక శివకుమార్, ఇద్దరి తండ్రి: రాజగోపాలాచారి R/o. సుభాష్ కాలనీ, భూపాల్‌పల్లి, జయశంకర్ జిల్లా గారలు జయశంకర్ జిల్లాలోని భూపాల్‌పల్లి మున్సిపాలిటీలో వార్డ్ నెం.6 సర్వేనెం.325, విస్తీర్ణం: 262.44 చ.గ.లలో నిర్మితమైన ఇంటి నెం.6-109/1, & 6-115/1 వాసాల గోపీకృష్ణ S/o. ప్రకాష్ R/o. మేన్‌రోడ్, భూపాల్‌పల్లి, జయశంకర్ జిల్లా గారి నుండి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 2772/2021 ద్వారా ఖరీదు చేసినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 804/2006 పోయినదని నాక్లయింట్లు తెలిపినారు. ఇట్టి డాక్యుమెంటు పై గాని లేదా పై ప్రాపర్టీల పై గాని ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల వ్రాతపూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. మరియు ఇట్టి డాక్యుమెంటు దొరికిన వారు నాక్లయింట్లకు లేదా నాకు అందజేయగలరు. పై ఇంటికి హద్దులు: తూర్పు: పరకాల నుండి మహదేవపూర్ వెళ్లే PWD రోడ్, పడమర: 16 ఫీట్ల రోడ్, ఉత్తరం: నాంపల్లి అయిలయ్య గారి ఇల్లు, దక్షిణం: ఇరుకుల్ల చంద్రమౌళి గారి ఇల్లు.

సం/- కస్తూరి ప్రకాష్, అడ్వకేట్
ఇ.నెం. 2-10-1292,జ్యోతినగర్,
కరీంనగర్ సెల్: 9985638238

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

మహదేవపూర్,మార్చి 18 : విద్యార్థులు సమాజ సేవ చేసి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎస్సై ప్రసాద్ అన్నారు. మండలంలోని సూరారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వంగపల్లి పరశురాములు ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సేవా పథకం ముగింపు కార్యక్రమం నిర్వహించగా ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని కలిగి ఉండి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జున్ను విజయ్ కుమార్, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీటీసీ తిరుమల ప్రతాప్‌రెడ్డి, హెచ్ఎం రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, RAJENDER CHENNOJI, S/O. VEERACHARY (Old Name), R/o. H.No. 35-3-241, Gopalapuram, Hanamkonda Dist., T.S., have changed my name as CHENNOJU RAJENDER, S/O. VEERACHARY (New name).
NTW-00

CHANGE OF NAME
★I, AAKULA SREEDHAR, S/O. AKULA SAILU (Old Name), R/o. H.No. 5-4-46, Kothur Street, Sabeer Hotel, Hanamkonda, Warangal, Hanumakonda, T.S.,- 506001, India, have changed my name to AKULA SRIDHAR (New name) solemnly Declare.
NTW-00

CHANGE OF NAME
★I, AKBARULLA BAIG (Old Name), S/o. VALIULLA BAIG, R/o. H.No. 2-7-837, Alipura, Subedari, Hanamkonda. have changed my name as MIRZA AKBARULLA BAIG (New name), S/o. VALIULLA BAIG.
NTW-00

CHANGE OF NAME
★I, SHAIK HUSSAIN, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as MOHAMMED SHAIK HUSSAIN, S/o. Mohammed Shaik Ali.
NT-328421

★I, SHAIK ALI, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as MOHAMMED SHAIK ALI.
NT-328421

★I, ZAHARA BEE, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as ZAHERA BEGUM, W/o. Mohammed Shaik Ali.
NT-328421

★I, NAJMUNNISA BEGAM, R/o. 10-9-4/1 Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as NAJMUNNISA BEGUM, W/o. Mohammed Shaik Hussain.
NT-328421

★I, MOHAMMED TALAHA UDDIN, R/o. 1-9-613/A, Basith Nagar, Julywada, Warangal-Hanumakonda, TS. Hence forth shall be known as MOHAMMED TALHA UDDIN, S/o. Abutaha Mohammed Abdul Raheem.
NT-328421

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

వందకు పైగా మొండి బకాయిలు

- రూ. 50వేల నుంచి రూ. 4 లక్షల వరకు పన్నుల పెండింగ్
- చెల్లింపులకు ముందుకురాని వైనం
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం

కృష్ణకాలనీ, మార్చి 18 : భూపాలపల్లి మున్సిపాలిటీలో పన్నుల చెల్లింపులో మొండి బకాయిదారులు వంద మందికి పైగా ఉన్నారు. పన్నుల వసూళ్లలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా 13 రోజుల గడువు మాత్రమే ఉన్నా వంద శాతం వసూలుపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఈనెల చివరినాటికి వసూలు చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. భూపాలపల్లి మున్సిపాలిటీలో రూ. 49,590 అంటే సుమారు రూ. 50వేల పైనుంచి రూ. 4,87,082 వరకు పెద్ద మొత్తంలో చెల్లించే మొండి బకాయిదారులు 100 మందికి పైగానే ఉన్నారు. అయినప్పటికీ చెల్లింపునకు వారు ముందుకు రావడం లేదు. వారికి రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. గడువులోగా బకాయిదారులు పన్నులు చెల్లించకపోతే ఆస్తులను జప్తు చేయాల్సి ఉంటుంది. కానీ, అధికారులు అలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. దీనికి తోడు సింగరేణితో పాటు ప్రభుత్వం కార్యాలయాల్లోని పన్నుల వసూళ్లపై ఇప్పటి వరకు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి వచ్చే పన్నుల ఊసే లేకుండా పోయింది. కింది స్థాయి సిబ్బందితో పాటు అధికారులు సైతం పన్నుల వసూళ్లలో పాల్గొనాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించినా కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అధికారులు ఇలానే వ్యవహరిస్తే వంద శాతం పన్నుల వసూలు కావడం కష్టంగానే ఉండనుంది.

నెల రోజుల్లో 30శాతం పన్నులు వసూలు చేశాం

నేను బాధ్యతలు స్వీకరించిన నెల రోజుల్లో 30 శాతం పన్నులు వసూలు చేశాం. 11 నెలల్లో 30శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి. గతంలో ప్రతి రోజూ రూ.20 వేల నుంచి రూ.30 వేలు మాత్రమే వసూలయ్యేది. ప్రస్తుతం తొమ్మిది ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రతి రోజూ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నాం. ప్రత్యేక శ్రద్ధతో గడువులోగా 100 శాతం వసూలు చేస్తాం. – టీ రాజేశ్వర్, కమిషనర్

ఏటూరునాగారం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

గణపురం : పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న పాఠశాల సిబ్బంది

పది పరీక్షలు ప్రారంభం

- ములుగులో 3,081, భూపాలపల్లిలో 3,536 మంది హాజరు
- ప్రశాంతంగా నిర్వహణ
- పరీక్ష కేంద్రాల్లో అధికారుల తనిఖీ

ములుగురూరల్/ భూపాలపల్లి రూరల్/మంగపేట, మార్చి18 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ములుగులో 3,888 మంది విద్యార్థులకు 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,081 మంది పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏటూరునాగారం మండలంలో రాష్ట్ర పరిశీలకుడు రాజీవ్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ములుగు మండలం జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకులంలో పరీక్షలను అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎస్పీ రవీందర్ తనిఖీ చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో 144 సెక్షన్‌ను అమలు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది విద్యార్థులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి లోనికి అనుమతించారు. భూపాలపల్లి జిల్లాలో 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎన్ రాంకుమార్ తెలిపారు. 3,547 మంది విద్యార్థులకు 3,536 మంది పరీక్షలకు హాజరు కాగా, 11 మంది గైర్హాజరైనట్లు ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా సజావుగా మొదటి రోజు పరీక్షలు జరిగాయని తెలిపారు. కాటారం మండలంలో పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కాటారం డీఎస్పీ జీ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. మంగపేట మండలంలోని మూడు కేంద్రాల్లో 330 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో రాజేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గణపురంలో..

గణపురం : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో తెలుగు పేపర్‌కు 408 మంది విద్యార్థులకు 405 మంది హాజరైనట్లు ఎంఈఓ రఘుపతి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షిస్తూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్, పరీక్షల అధికారి భద్రయ్య తనిఖీ చేశారు. ఎస్సై మచ్చ సాంబమూర్తి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి కొడవటంచ బ్రహ్మోత్సవాలు

20న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, మార్చి 18 : కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల బాంధవుడిగా రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి నిత్య పూజలందుకుంటున్నాడు. సత్య నిష్టతో నమ్మి కొలిచిన భక్తుల కష్టాలు తీర్చడం స్వామి వారి ప్రత్యేకత. ప్రతి ఏటా శుద్ధ దశమి నేటి (మంగళవారం) నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వారం రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. వందల ఏళ్ల చరిత్ర కల్గిన కొడవటంచ క్షేత్రం భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతోంది. నేటి నుంచి 27వ తేదీ వరకు కొడవటంచ లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. 19న బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 20న స్వామి వారి కల్యాణం, 21న గజవాహన సేవ, నిత్య పూజలు, 22న హోమం, బలిహరణం, ఉత్సవ సేవ, 23న సింహ వాహన సేవ, 24న హనుమంతు సేవ, 25న జాతర ప్రారంభం బోనాలు తిరుగుట, పెద్ద రథోత్సవం, 26న జాతర సేవలు, మొక్కులు, 27న రాత్రి అభిషేకం, నాగబలితో జాతర ముగియనుంది.

భక్తులకు ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. తాగునీటి సరఫరా, ఆర్టీసీ సౌకర్యం, విద్యుత్, వైద్య సేవలు, పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వామి దర్శనానికి క్యూలైన్లు, పారిశుధ్య పనులు, స్నానఘట్టాలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. విశ్రాంతి గదుల నిర్మాణం, ఆలయ ఆవరణ చుట్టూ సీసీ రోడ్లు, నూతన కల్యాణ మండపం, యాగశాల, గోశాల, ఆలయ పునర్‌నిర్మాణ పనులు చేపట్టామన్నారు. భక్తులు విడిది చేసేందుకు ప్రత్యేక స్థలాలు, వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సామగ్రి మాయంపై అధికారుల్లో ఉలిక్కిపాటు

- మేనేజ్ చేయాలని అధికారులకు హుకుం
- 'నమస్తే' కథనానికి స్పందన

తాడ్వాయి, మార్చి18 : మేడారం జాతర సందర్భంగా ఐటీడీఏ అతిథి గృహంలో కొనుగోలు చేసిన సామగ్రి మాయంపై అధికారులు ఉలిక్కిపడుతున్నారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'ఐటీడీఏ సొమ్ము ఇంటి దొంగల పాలు' అనే కథనం కలకలం రేపింది. ఇండ్లకు పట్టుకెళ్లిన సామగ్రిని తీసుకురావాలని ఐటీడీఏ ఏటీడీవో నుంచి మొదలు ఇతర ఉన్నతాధికారులు కింది స్థాయి అధికారులకు హుకుం జారీ చేశారు. మరికొంత మంది అధికారులు వివిధ హాస్టళ్లలో భద్రపరిచామని నమ్మబలుకుతూ రాత్రి సమయాల్లో ఒక్కొక్కటిగా చేర్చుతున్నారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు చేసిన చందంగా వాటాలు వేసుకొని పంచుకున్న సామగ్రి విషయం ఉన్నతాధికారుల మెడకు చుట్టుకునేలా ఉంది. కొందరు అధికారులు ఒక అడుగు ముందుకు వేసి పత్రికల్లో కథనాలు రాకుండా చూసుకోవాలని సూచనలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆరా తీసి అధికారుల తీరుపై మండిపడినట్లు తెలిసింది. ఐటీడీఏ సొమ్మును ఏ మేరకు దండుకుంటున్నారో అని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాతర ఆదాయం రూ.7.81 లక్షలు

మొగుళ్లపల్లి, మార్చి 18 : గత నెల మండలంలో జరిగిన మొగుళ్లపల్లి-ములుకలపల్లి సమ్మక్క సారలమ్మ జాతర హుండీలను సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. మండల కేంద్రంలోని శివాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.7,81,403 సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు.

ఉచ్చులు పెట్టొద్దు

వాజేడు, మార్చి 18 : అటవీ జంతువుల వేటకు ఉచ్చులు, కరెంటు తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. మండలంలోని ఇప్పగూడెంలో సోమవారం గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్ నిర్వహించి ఆయన మాట్లాడారు. విప్లవ సంఘాలు, పార్టీలు, మావోయిస్టులకు సహకరించవద్దని, వారికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం జగన్నాథపురం వై జంక్షన్ వద్ద వెంకటాపురం సీఐ బండారు కుమార్, సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలతో కలిసి ఎస్సై వాహనాలను తనిఖీ చేశారు. సరైన వాహన ధ్రువ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

పరిహారం అందిస్తాం

గణపురం, మార్చి 18 : మండలంలోని ధర్మారావుపేట గ్రామ శివారు కేటీకే ఓసీ-3లో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు నష్టపరిహారం అందిస్తామని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంపల్లి జీపీ పరిధిలోని కొండపల్లిలో జరిగినా ఎస్ఈసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటి స్థలాలు కోల్పోతున్న 374 పీడీఎఫ్‌లోని 344మంది భూ నిర్వాసిత రైతులు, గ్రామస్తుల పేర్లను సింగరేణి, రెవెన్యూ అధికారులు గ్రామ సభలో వినిపించారు. గ్రామానికి చెందిన మోతె కరుణాకర్‌రెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో మాధవరావుపల్లి గ్రామస్తులకు ఇచ్చిన ఖరీదు రూ.15 లక్షలు తమ భూములకు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. తాము విలువైన భూములు కోల్పోయామని, ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశా రు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ మురళీధర్‌రావు, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ దేవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహదేవపూర్ (మల్హర్), మార్చి 18 : పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని మండల కారోబార్లు ఎంపీడీవో శ్యాం సుందర్‌ను కోరారు. సోమవారం వారు ఎంపీడీవోను కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీవో విక్రమ్‌కుమార్, సంఘం మండల అధ్యక్షుడు కనుకుల శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు అజ్మత్ అలీ, ప్రధాన కార్యదర్శి నారా శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగపు శ్రీకాంత్, విజయగిరి బాపు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ములుగురూరల్/ గోవిందరావుపేట, మార్చి18 : పౌష్టికాహారంతోనే మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవోలు స్వాతి, మల్లీశ్వరి అన్నారు. సోమవారం ములుగు మండలం అబ్బాపురం జీపీ పరిధి శ్రీరాములపల్లి గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గోవిందరావుపేట మండలం పస్రాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారంతో కూడిన చిరు ధాన్యాలు, గుడ్లు, ఆకు కూరలతో ఆరోగ్య పరంగా ఎంతో లాభముందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులకు హాజరై గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలకు ఎలాంటి సమస్య ఉన్నా 181 లేదా 1098కు కాల్ చేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, రాణి, సంధ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గణపురంలో..

గణపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పొలం లక్ష్మి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని 5వ అంగన్ వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలకు రక్తహీనత రాకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సరోజ, ఇందిర, దేవకమ్మ, శ్రావణి, సుశీల పాల్గొన్నారు.

గోవిందరావుపేట : పస్రాలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో మల్లీశ్వరి, అంగన్‌వాడీలు

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

మహదేవపూర్ : తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. సోమవారం మండలంలోని రాపల్లికోట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలను పట్టించాలన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినతి పత్రాలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించండి

భూపాలపల్లి రూరల్, మార్చి 18 : ప్రజావాణి సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి డబుల్ బెడ్‌రూమ్, భూ సమస్యలు, పింఛన్ల కోసం తొమ్మిది దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుంచి సిఫారసు చేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

తాగునీటి వృథాను అరికట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

కృష్ణకాలనీ, మార్చి 18 : మున్సిపాలిటీలో తాగునీటి వృథాను అరికట్టాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా మున్సిపల్, మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం తాగునీటి సరఫరాపై మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించడంలో భూపాలపల్లిని ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. వ్యర్థాల సేకరణ, మంచినీటి సరఫరాపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. రానున్న వారం రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామన్నారు. నీటి సరఫరాలో వాల్స్ సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలన్నారు. మున్సిపాలిటీని ఆరు జోన్లుగా విభజించి సమగ్రమైన నివేదిక ఇవ్వాలన్నారు. కుళాయిలకు ఎవరైనా మోటర్లు బిగిస్తే కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపు ఆపరేటర్లు నీటిని సరఫరాలో అలసత్వం వహిస్తున్నారని, అలా చేస్తే చర్యలు తీసుకోవడంతో పాటు వేతనాలు కట్ చేస్తామని హెచ్చరించారు. సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దని, ట్యాంక్‌లపై పంపు ఆపరేటర్లు, ఏఈ నంబర్లు రాసిపెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్, ప్రజారోగ్యశాఖ ఈఈ రాజ్‌కుమార్, గ్రిడ్ ఈఈ మాణిక్యరావు, డీఈ పరమేశ్వరి పాల్గొన్నారు.

నీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

ఏటూరునాగారం : వేసవి కాలం నేపథ్యంలో మూడు నెలలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంచినీటి సరఫరాపై ఏటూరునాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. లీకేజీలు ఉన్న చోట వెంటనే అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. అవసరమున్న చోట హ్యాండ్ పంపులు, బోర్ వెల్స్ ద్వారా నీటిని అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డిప్యూటీ సీఈవో రమాదేవి, డీఈ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మహదేవపూర్,(కాటారం), మార్చి 18 : 33 కేవీ విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో కాటారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు (మంగళవారం) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి మేఘనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఈఈ వీరభద్రం బాధ్యతల స్వీకరణ

ఏటూరునాగారం మార్చి18 : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఈఈ గా వీరభద్రం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న హేమలత బదిలీ కావడంతో ఆమె స్థానంలో వీరభద్రంను నియమించారు. కాగా, ఈఈని సారలమ్మ పూజారి కాకా వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ కునూరు అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్ల బహిరంగ వేలం రద్దు

కృష్ణకాలనీ, మార్చి 18 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి భూపాలపల్లి, ఖాసీంపల్లి, జంగేడు తైబజార్ (గంపచీటీ) వారాంతపు అంగడి బహిరంగ వేలం 20న నిర్వహించాల్సి ఉండగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత తేదీలను ప్రకటించనున్నట్లు చెప్పారు.

రాధికకు మహిళా సాధికారత అవార్డు

మహదేవపూర్, (కాటారం), మార్చి 18 : కాటారం మండలం రేగులగూడెం గ్రామానికి చెందిన పులి రాధికకు సేవ్ ది గర్ల్స్ చైల్డ్, ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత అవార్డు అందజేశారు.ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైల్ సూపరిండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పేద కుటుంబానికి చెందిన రాధిక తెలంగాణ సాంస్కృతిక సారథిలో కొనసాగుతూ ఆడ పిల్లల చైతన్యంపై పాడిన పాట అవార్డుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ స్టార్ గంగవ్వ, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

26 నుంచి నాగులమ్మ సుంకు పండుగ

మంగపేట, మార్చి 18 : మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధి లక్ష్మీనర్సాపురంలో వెలసిన నాగులమ్మ గుడి వద్ద ఈనెల 26 నుంచి 29 వరకు సుంకు పండుగ (మినీ జాతర) నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బాడిశ రామకృష్ణ స్వామి తెలిపారు. గుడి ఆవరణలో సోమవారం ప్రధాన పూజారులు, వడ్డెల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మినీ జాతర కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 26న మండె మెలుగుట, 27 నాగులమ్మకు ప్రత్యేక పూజలు, 28న సుంకుపండగ, ఇందులో భాగంగా గోదావరి నదిలో ప్రత్యేక పూజలు, ఇదే రోజు రాత్రి నాగులమ్మకు సంబంధించిన యేల్పుల డాలుగుడ్డకు ఆదివాసీ సంప్రదాయాలతో పూజలు నిర్వహించనున్నారు. డోలు వాయిద్యాల ప్రదర్శన, 29న నాగులమ్మ ఊరేగింపు మహోత్సవం ఉంటుందన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన పూజారి బాడిశ నాగరమేశ్, నవీన్, ఎం శివ, సోడి శ్రీను, వడ్డెలు పాల్గొన్నారు.

మల్లంపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

ములుగురూరల్, మార్చి18 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మల్లంపల్లి వద్ద పోలీస్ అధికారులు సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టును డీఎస్పీ రవీందర్ సందర్శించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎస్పీ పీ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు రహదారుల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేటీకే ఓసీ-3 ప్రాజెక్టు అధికారిగా భిక్షమయ్య

గణపురం, మార్చి 18 : భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-3 ప్రాజెక్టు అధికారిగా వాసం భిక్షమయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఓసీ-2లో మేనేజర్‌గా ఉన్న ఆయన పదోన్నతిపై ఓసీ-3 ప్రాజెక్టు అధికారిగా వచ్చారు. ఓసీ-3 ప్రాజెక్టు అధికారిగా ఉన్న ఎన్ వెంకటేశ్వర్‌రావు రామగుండం ఎస్ఓటూ జీఎంగా బదిలీపై వెళ్లారు. భిక్షమయ్యను సింగరేణి అధికారులు, కార్మికులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పకడ్బందీగా ఎలక్షన్ కోడ్ అమలు

కృష్ణకాలనీ, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. సోమవారం మున్సిపల్ అధికారులు జిల్లా కేంద్రంలోని రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను సిబ్బంది సాయంతో తొలగించారు. గోడలపై ఉన్న రాతలను తుడిపించారు. పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనుల శిలాఫలకాలపై చెక్కిన పేర్లు కనబడకుండా పేపర్‌తో మూసివేయించారు. గణేశ్ చౌక్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ముసుగు తొడిగారు. ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లను పూర్తిగా తొలగించారు.

శిలాఫలకాన్ని మూసివేస్తున్న సిబ్బంది